సాక్షి
తిరుపతి

శుక్రవారం । 10 । జనవరి । 2025

స్విమ్స్‌లో బాధిత భక్తులను పరామర్శిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పక్కన మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి



న్యూస్‌రీల్

నేటి నుంచి సంక్రాంతి సెలవులు

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ, జూనియర్ కళాశాలలకు శుక్రవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు మంజూరు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీకి సైతం శుక్రవారం నుంచి పీజీ కళాశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు.

అంబేడ్కర్ వర్సిటీ విద్యార్థులకు శుభవార్త

తిరుపతి సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపన్ వర్సిటీ ద్వారా పలు కోర్సులలో డిగ్రీ చదువుతున్న విదార్థులకు వర్సిటీ శుభవార్త చెప్పింది. 1987 నుంచి 2012వరకు పలు యూజీ కోర్సులలో అడ్మిషన్లు పొంది బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు పెండింగ్‌లో ఉన్న వారు ఈ ఏడాదిలోపు దరఖాస్తు చేసుకుని ఉత్తీర్ణత సాధించాలని అధికారులు సూచించారు. ఈమేరక ఇప్పటికే జిల్లాలోని అన్ని అంబేడ్కర్ స్టడీ సెంటర్లకు సమాచారం అందించారు. ఈ ఏడాది రెండు సార్లు పెండింగ్ సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహిస్తారని, ఆ తర్వాత ఎటువంటి రిలాక్సేషన్ ఉండదని తెలియజేశారు. మరింత సమాచారం కోసం తాము అడ్మిషన్లు పొందిన స్టడీ సెంటర్లను సంప్రదించాలని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వై.మల్లికార్జున రావు తెలిపారు.

ప్రధాని గుర్తింపు మరింత బాధ్యతను పెంచింది



దాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ (వరదయ్యపాళెం): ఆంధ్రప్రదేశ్ తయారీ కేంద్రంగా మార్చడంలో శ్రీసిటీ కీలక పాత్రను గుర్తించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో శ్రీసిటీని గురించి ప్రస్తావించడం, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) వంటి కార్యక్రమాల ద్వారా రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి, ప్రపంచ తయారీ రంగంలో భారతదేశం అగ్రగామిగా ఎదగడానికి శ్రీసిటీ చేస్తున్న కృషిని ప్రశంసించారన్నారు. ప్రధాన మంత్రి స్థాయిలో శ్రీసిటీ గుర్తింపు పొందడం తమకు గర్వకారణమని వ్యాఖ్యానించారు.

బాలికోన్నత పాఠశాలకు అవార్డు

నారాయణవనం: జాతీయ స్థాయిలో ఉత్తమ హరిత పాఠశాలగా స్థానిక బాలికోన్నత పాఠశాల ఎంపికైందని హెచ్ఎం శశికళ, గ్రీన్ కోర్ సన్వయకర్త శ్యామలత తెలిపారు. జీఎసీ న్యూఢిల్లీ వారు 2024–25 సంవత్సరాని నిర్వహించిన ప్రోగ్రాంలో వరుసగా మూడో సారి అవార్డుకు ఎంపికైందని వారు తెలిపారు. జనవరి 30న న్యూ ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నట్లు శశికళ తెలిపారు.

అడ్డంకులను ఛేదిస్తూ.. ఆత్మీయత కురిపిస్తూ..

- వైఎస్ జగన్ వెళ్లకుండా ఎక్కడికక్కడ అడ్డంకులు
- వైకుంఠ ద్వార దర్శన బాధితులను పరామర్శించకుండా కూటమి నేతల ఎత్తుగడలు
- కుటిల రాజకీయాలకు తలొగ్గిన పోలీసులు
- అన్నింటినీ దాటుకుని గాయపడ్డ భక్తులను పరామర్శించిన మాజీ సీఎం
- ఆత్మీయతను పంచుతూ.. అండగా నిలుస్తామని భరోసా
- నేను ఉన్నానని.. ఆదుకుంటానని హామీ

ఆంక్షల కంచెను ఛేదించారు. కూటమి కుట్రలను భగ్నం చేశారు. పోలీసుల ఎత్తుగడలను చీల్చుకుంటూ శ్రీపద్మావతి మెడికల్ కళాశాలకు చేరుకున్నారు. బుధవారం రాత్రి వైకుంఠద్వార దర్శన టికెట్ల తోపులాటలో గాయపడి చికిత్స పొందుతున్న వారిని గురువారం మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. ముందుగా ఆయన రేణిగుంట విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన తిరుపతి బయల్దేరారు. తిరుచానూరు వద్దకు చేరుకోగానే పోలీసులు అడ్డంకులు సృష్టించారు. కూటమి నేతల ఒత్తిడి మేరకు సుమారు అర్ధగంట తర్వాత వెళ్లాలని సూచించారు. వారి కుటిల బుద్ధిని గ్రహించిన జననేత కాలినడకన బయల్దేరారు. కొంతదూరం వెళ్లాక పార్టీ కార్యకర్త కారులో శ్రీపద్మావతి మెడికల్ కళాశాలకు చేరుకున్నారు. గాయపడి అక్కడ చికిత్స పొందుతున్న బాధితులను ఆప్యాయంగా పలకరించారు. చేతులు పట్టుకుని ఆత్మీయతను కురిపించారు. గాయాలను చూసి చలించిపోయారు. అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. తొక్కిసలాట ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యుల కన్నీళ్లు తుడిచి ఓదార్చారు. నేనున్నానంటూ భరోసానిచ్చారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు. పరామర్శలో మాజీ ముఖ్యమంత్రి వెంట మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, గురుమూర్తి, పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, సమన్వయకర్తలు విజయానందరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి ప్రతినిధి, తిరుపతి



పరామర్శిస్తున్న వైఎస్.జగన్, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యేలు



వైద్యసేవలపై ఆరా తీస్తున్న వైఎస్ జగన్, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



క్షతగాత్రురాలిని ఆప్యాయంగా ఓదార్చుతూ..



వైద్యులతో మాట్లాడుతున్న మాజీ సీఎం



క్షతగాత్రురాలి పరిస్థితిని వివరిస్తున్న ఎంపీ



వైఎస్.జగన్‌కు శ్రేణుల అభివాదం

తలోమాట

సాక్షి ప్రతినిధి, తిరుపతి : తొక్కిసలాట ఘటనపై సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తలోమాట మాట్లాడారు. వేర్వేరు అధికారులను టార్గెట్ చేసి మాట్లాడారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని సీఎం చంద్రబాబు నోరెత్తి మాట్లాడలేదు. డెప్యూటీ సీఎం మాత్రం టీటీడీ చైర్మన్, ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి తప్పుందని తేల్చిచెప్పారు. వారి మధ్య సమన్వయ లోపం వల్లే తొక్కిసలాట జరిగిందని స్పష్టం చేశారు. తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, జేఈఓ గౌతమి, సీఎస్ఓ శ్రీధర్, గోశాల డైరెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డిపై చర్యలు తీసుకున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. అదే విధంగా తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తొక్కిసలాట జరిగింది. ఆ పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు మూడు నెలలుగా సీఐ లేరు. సీఐగా పనిచేస్తున్న మహేశ్వర్‌రెడ్డిని గతంలో బదిలీ చేశారు. అప్పటి నుంచి సీఐని నియమించలేదు. వెస్ట్ సీఐకి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. అదే విధంగా తిరుపతిలోని కొందరు డీఎస్పీలు, సీఐలు చేసిన తప్పిదమే ఘోరమైన ఘటనకు కారణంగా పోలీసు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. భక్తుల రద్దీ పెరుగుతున్న విషయాన్ని ఆ డీఎస్పీలు, సీఐలు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లలేదని తెలిసింది. ముఖ్యంగా నిఘా వర్గాలైన ఇంటిలిజన్స్, విజిలెన్స్, ఎస్పీ రద్దీని ఎందుకు అంచనా వేయలేకపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కూటమి 'షో'

- పరామర్శల పేరుతో ఫొటోలకు ఫోజులిచ్చిన సీఎం, డెప్యూటీ సీఎం
- తూతూమంత్రంగా బాధితుల పరామర్శ



అధికారులపై సీఎం చంద్రబాబు ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్

తిరుపతి అర్బన్/తిరుపతి గాంధీరోడ్డు : భక్తులకు భద్రత కల్పించడంలో విఫలమైన కూటమి ముఖ్యనేతలు సీఎం చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పరామర్శల పేరుతో షో చేసి వెళ్లడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా .. ఆరుగురు భక్తుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాక అధికారులపై చిందులేయడమేంటని మండిపడుతున్నారు. గురువారం తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల పంపిణీ కేంద్రాలను వారు పరిశీలించారు. భక్తుల తోపులాటకు గురైన ఘటనా స్థలాలను పరిశీలిస్తున్న సందర్భంగా వారు ప్రవర్తించిన తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. కేవలం టీవీలు, పత్రికల్లో ఫొటోలకు ఫోజులిచ్చేందుకు మాత్రమే వారు ప్రాధాన్యత ఇచ్చారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను కూడా తూతూమంత్రంగా పరామర్శించారని మండిపడుతున్నారు. మృతుల కుటుంబాలకు మేమున్నామని భరోసా నివ్వాల్సిన నేతలు కేవలం కంటితుడుపుగా కన్నీళ్లు తుడిచి వెళ్లారని పేర్కొంటున్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వారు చనిపోవడం.. వారికి మొక్కుబడిగా ప్రభుత్వం తరఫున రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియో ప్రకటించడంపై మండిపడుతున్నారు. ప్రభుత్వ తప్పిదం వల్లే వారి ప్రాణాలు పోయాయని, ఒక్కో కుటుంబానికి కనీసం రూ.50 లక్షలైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే మృతుల కుటుంబ సభ్యులకు టీటీడీ లోనే ఉద్యోగాలు కల్పించాలని సూచిస్తున్నారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా టీటీడీలో రాజకీయ నేతల అడుగులకు మడుగులొత్తుతూ సాధారణ భక్తులను గాలికొదిలేయడం బాధాకరమన్నారు.

టోకెన్ల జారీలో పటిష్ట చర్యలు చేపట్టాలి



టికెట్ల జారీ కేంద్రాలను పరిశీలిస్తున్న భూమన, మోహిత్‌రెడ్డి

తిరుపతి మంగళం: వైకుంఠ ద్వారా దర్శన టోకెన్ల జారీలో ఇప్పటికైనా టీటీడీ, పోలీస్ వ్యవస్థలు పటిష్ట చర్యలు చేపట్టాలని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి డిమాండ్ చేశారు. తొక్కిసలాట జరిగిన కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. టీటీడీ, పోలీస్‌ల వైఫల్యాలపై క్యూలైన్లలోని భక్తులతో మాట్లాడారు. ఊడిగం చేయడం మానుకోవాలని ఆయన సూచించారు. ఆయనతో పాటు చంద్రగిరి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఉన్నారు.

శవరాజకీయాలొద్దు



తిరుపతి అర్బన్/క్రైమ్/ఎడ్యుకేషన్/కల్చరల్ : వైకుంఠ ఏకాదశి దర్శన టికెట్ల జారీలో నెలకొన్న దుర్ఘటనను రాజకీయం చేస్తూ వైఎస్సార్‌సీపీపై నిందారోపణలు చేసిన బీసీవైపీ పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్‌ను మీడియా సాక్షిగా వైఎస్సార్‌సీపీ నేత గీతా యాదవ్ అడ్డుకున్నారు.

చంపేశారు స్వామీ!

- వైకుంఠ ద్వార దర్శన టికెట్ల జారీ ఏర్పాట్లు అస్తవ్యస్తం
- దైవదర్శనానికి వస్తే శవాన్ని చేతికిచ్చారు
- అధికారుల అలసత్వంతోనే నిండు ప్రాణాలు బలి
- అరుణాచలం, శబరిమలైలో ఇలాంటి ఘటనలే ఉండవు
- అధికారుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనం
- టీటీడీలో క్రమశిక్షణ, భయం, భక్తి కొరవడిందంటున్న భక్తులు, స్థానికులు

'భక్తులకు భద్రత కల్పించాల్సిన అధికారులు నాయకులకు గులామ్ అయ్యారు. అడుగడుగునా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. భక్తుల నిండు ప్రాణాలను గాల్లో కలిపేశారు. ప్రాణాలతో వైకుంఠ ద్వార దర్శనానికి వస్తే.. శవాన్ని చేతికిచ్చారు. టీటీడీ అధికారుల తీరుతో భక్తులు నరకయాతన పడ్డారు. బుధవారం తిరుపతి బైరాగిపట్టెడ ద్వార దర్శన టికెట్ కౌంటర్ల వద్ద జరిగిన తోపులాటలో ఐదుగురు మహిళా భక్తులు, ఒక పురుషుడు చనిపోవడం దారుణం. 48 మంది భక్తులు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలు కావడానికి ప్రధాన కారకులు టీటీడీ, పోలీసు అధికారుల నిఘా లోపల్యమే. అరుణాచలంలోని గిరిప్రదక్షిణ, తిరువణ్ణామలై కార్తికదీపం, శబరిమలై దర్శన సమయంలో ఇలాంటి ఘటనలు ఎప్పుడూ చోటు చేసుకోలేదు. టీటీడీ అధికారుల నిర్లక్ష్యం, అధికారులు, నేతల మధ్య సమన్వయ లోపంతోనే భక్తుల ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది'.. అని స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు విమర్శలు గుప్పిస్తున్నారు.

– తిరుపతి సిటీ



క్యూలో ఇక్కట్లు పడుతున్న భక్తులు

చిత్రహింసలకు గురిచేశారు



సాధారణ భక్తుల సేవకు ప్రాధాన్యత నిస్తామంటూ పాలకులు, అధికారులు ప్రగల్భాలు పలికారు. లక్షల మందికి వైకుంఠ ద్వార దర్శన టికెట్ల కౌంటర్లకు రప్పించి చిత్రహింసలకు గురిచేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం టీటీడీలో ఉద్యోగం కల్పించాలి. రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియో అందించాలి. టీటీడీలో అధికారుల తీరు మారేందుకు ప్రభుత్వ కఠినంగా వ్యవహరించాలి.

–లక్ష్మమ్మ, సీఐటీయూ నాయకురాలు, తిరుపతి

టీటీడీలో రాజకీయ జోక్యం ఎక్కువ



ఉద్యోగులు సేవే లక్ష్యంగా పని చేయాల్సి ఉంది. కానీ టీటీడీలో అధికారులు, సిబ్బంది కలెక్టర్, సీఎం స్థాయితో పోల్చుకుంటున్నారు. భక్తులతో అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారు. టీటీడీలో పనిచేస్తున్నామంటే తామే దేవుళ్లుగా ఫీలవుతుంటారు. భక్తులంటే రోడ్లపై అడుక్కుతినే యాచకుల కంటే హీనంగా చూస్తున్నారు. గతంలో ఇలాంటి సంస్కృతి ఉండేది కాదు. గోవిందా అంటూ భక్తులను ప్రస్తావించే వారు. టీటీడీలో రాజకీయ జోక్యం ఎక్కువ కావడంతో ఇలాంటి పరిస్థితి నెలకొంది. టీటీడీలో ప్రక్షాళన చేపట్టాలి.

–గణేష్, భక్తుడు, తిరుపతి

భక్తులను లెక్కచేయలేదు



తమిళనాడులోని అరుణాచలంలో గిరిప్రదక్షిణకు పలు రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు హాజరువుతుంటారు. ఇప్పటివరకు చిన్న ఘటన చోటు చేసుకోలేదు. అక్కడి పద్ధతులు, ఉద్యోగులు, అధికారుల ప్రవర్తన, భక్తులపై ప్రేమానురాగాలు కురిపిస్తుంటారు. కానీ తిరుమల అధికారుల తీరు అందుకు భిన్నంగా ఉంటోంది. దురుసు ప్రవర్తనతో పాటు, భక్తులను లెక్కచేయకుండా మాట్లాడుతుంటారు. ఇలాంటి ఘటనలకు బాధ్యులైన టీటీడీ అధికారులను తక్షణం సస్పెండ్ చేయాలి.

–ప్రకాష్, స్థానికుడు, తిరుపతి రూరల్

టీటీడీ చరిత్రలో దుర్దినం



టీటీడీ చరిత్రలో ఇదో దుర్దినం అని చెప్పాలి. ఇందుకు ప్రధాన కారణం పోలీసుల నిర్లక్ష్య వైఖరితో పాటు, టీటీడీ అధికారుల వ్యవహార శైలే కారణం. పర్యవేక్షణ, ఏర్పాట్ల విషయంలో నిర్లక్ష్యం వహించారనే విషయం సుస్పష్టం. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల మాట దేవుడెరుగు కనీసం స్థానికులతో సైతం వారి వ్యవహార శైలి అహంకారపూరితంగా ఉంటుంది. దేశంలోని ఏ దైవ క్షేత్రాలలోనూ ఇలాంటి వ్యవహార శైలి కనబడదు. భక్తులతోనే చలగాటం ఆడుకోవడంతో సనాతనధర్మానికి ఇదో పెను ముప్పు.

–గౌరీదేవి, స్థానికురాలు, తిరుపతి

ప్రభుత్వ తప్పిదం వల్లే



లక్షల మంది భక్తులు వస్తారని తెలిసి కూడా అధికారులను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. టీటీడీ అధికారులు కూడా నిర్లక్ష్యంగా వహించారు. లక్షల మంది శ్రీవారి భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్నారు. వైకుంఠ ద్వార దర్శన టికెట్ల జారీ విషయంలో అధికారులు, పోలీసుల తప్పిందం స్పష్టంగా కనిపిస్తోంది. తమిళనాడు, ఆంధ్ర, కేరళ భక్తులు క్యూలైన్ల తొక్కిసలాటలో చనిపోవడం దారుణం. కనీస వసతుల కల్పనపైనా, భక్తులను కంట్రోల్ చేయడంలోనూ.. వారికి టోకన్ల సమాచారం అందించడంలోనూ ప్రభుత్వం విఫలమైంది. బుధవారం జరిగిన ఘటనపై విచారణ జరిపి కారకులను కఠినంగా శిక్షించాలి.

–నారాయణరావు, రిటైర్డ్ ఉద్యోగి, తిరుపతి

ఇంత నిర్లక్ష్యమా?



తిరుణ్ణామలైలో గత ఏడాది జరిగిన కార్తీక దీపోత్సవంలో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి కోట్ల మంది భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. ఆ ప్రదేశంలో అడుగడుగునా పోలీసు బందోబస్తు కల్పించారు. భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించారు. కానీ తిరుమలలో వైకుంఠ ద్వార దర్శన టికెట్ల క్యూలైన్లలో తాగునీరు, భోజన వసతి, కనీసం మరుగుదొడ్లు కూడా లేవు. పిల్లలు, మహిళలు, వృద్ధులు పడిన బాధ వర్ణనాతీతం. ప్రత్యక్ష సాక్షిగా చెబుతున్నా. తొక్కిసలాటలో చనిపోయిన వారి ఉసురు అధికారులకు, ఈ ప్రభుత్వానికి తగులుతుంది. ఒక్కసారిగా క్యూలోకి భక్తులను వదలడం వల్లే తొక్కిసలాట జరిగింది.

–సుహాసిని, ప్రత్యక్ష సాక్షి, బైరాగిపట్టెడ, తిరుపతి

రిపబ్లిక్ డే క్యాంప్‌లో వెటర్నరీ విద్యార్థినికి కాంస్య పతకం



కాంస్య పతకం సాధించిన జి.అంజలి

తిరుపతి సిటీ : ఢిల్లీ వేదికగా ఎన్‌సీసీ క్యాడెట్లకు నిర్వహించిన రిపబ్లిక్ డే స్పెషల్ క్యాంప్‌లో తిరుపతి ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థి జి.అంజలి హార్స్ రైడింగ్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఆమె ఈ నెల 26వ తేదీన జరిగే రిపబ్లిక్ డే దినోత్సవ పరేడ్‌కు ఎంపికైంది. ఆమెను కళాశాల డీన్ డాక్టర్ జగపతిరామయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ సుధీర్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

మహిళా వర్సిటీలో పలు కోర్సుల్లో అడ్మిషన్లు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలో 2025 ఏడాదికి సంబంధించి మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ (సంగీతం), మాస్టర్ ఆఫ్ కామర్స్, మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్(తెలుగు), డిప్లొమా ఇన్ మ్యూజిక్ (సంకీర్తన, వర్ణం, అన్నమయ్య అంతరంగం)లో ప్రవేశానికి మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీవోఈ డైరెక్టర్ ఎం.అరుణ తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. వచ్చే నెల 7 నుంచి 12వ తేదీవరకు కౌన్సెలింగ్ ఉంటుందని, వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ లేదా 0877–2284524, 8121787415 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

కుమార్‌కు సంస్కృత అనువాద పరికరం పేటెంట్



అధ్యాపకుడు డాక్టర్ కుమార్ బాగే

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ ఎడ్యుకేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కుమార్ బాగే వాడిమస్‌కు సంస్కృత అనువాద పరికరంపై పేటెంట్ లభించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం గురువారం సమాచారం అందించింది. స్పీచ్ టూ టెక్ట్స్, టెక్ట్స్ టూ స్పీచ్ ఫంక్షనాలిటీని సులభతరం చేసేందుకు ఆయన ఏఐ ఆధారిత సంస్కృత అనువాద పరికరానికి రూపకల్పన చేశారు. అరుదైన అవకాశాన్ని దక్కించుకున్న అధ్యాపకుడు కుమార్ బాగేను వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్, అధ్యాపకులు అభినందించారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 62,903 మంది స్వామివారిని దర్శించుకోగా 17,363 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.51 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్‌లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం సినీ నటుడు బ్రహ్మానందం, డీఆర్డీఏ మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



వైకుంఠ దర్శనానికి సర్వం సిద్ధం

తిరుమల : కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమలలో వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనానికి సర్వం సిద్ధమైంది.. శుక్రవారం వేకువజామున శ్రీవారి ఆలయాన్ని తెరిచి ఏకాంతంగా స్వామివారి పూజాది కైంకర్యాలు, అభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం వేకువజామున 4.30 గంటల నుంచి శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాన్ని ప్రారంభించనున్నారు. శుక్రవారం నుంచి ఈనెల 19వ తేదీ రాత్రి 12గంటల వరకు 10 రోజులపాటు టీటీడీ భక్తులకు వైకుంఠద్వార దర్శనం కల్పించనుంది. మరో వైపు వీఐపీలు పెద్దసంఖ్యలో తిరుమలకు చేరుకున్నారు. ఇప్పటికే తిరుపతిలో శుక్రవారం, శనివారం, ఆదివారాలకు సంబంధించిన ఎస్‌ఎస్‌డీ టోకెన్లు జారీచేసిన సంగతి తెలిసిందే. ఈనెల 13వ తేదీ నుంచి ఏరోజుకారోజు ఎస్‌ఎస్‌డీ ఆఫ్‌లైన్ టికెట్లను తిరుపతిలో కేటాయిస్తారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయాన్ని రంగురంగుల పుష్పాలతో, విద్యుద్దీపాలంకరణతో అలంకరించారు.







విద్యుత్ కాంతుల్లో తుమ్మలగుంట



తుమ్మల గుంటలోని కల్యాణ వెంకన్న ఆలయం ఎదుట విద్యుద్దీపాలంకరణ

- తుమ్మలగుంటకు వైకుంఠ శోభ
- ఏర్పాట్లను పరిశీలించిన చెవిరెడ్డి
- సామాన్య భక్తులకు సకాలంలో దర్శనం కలిగించేలా చర్యలు
- క్యూలైన్లలో భద్రతా పరమైన చర్యలపై ప్రత్యేక శ్రద్ధ

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీ కల్యాణ వెంకన్న ఆలయంలో శుక్రవారం జరిగే వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సర్వం సిద్ధం చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గురువారం ఆలయంలో ఏర్పాట్లపై సమీక్ష చేశారు. ప్రధాన ఆలయంతో పాటు వైకుంఠ ద్వారం మొత్తం పుష్పాలతో తీర్చిదిద్దారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భక్తుల రద్దీకి తగ్గట్టుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ప్రధాన ఆలయం ముందు భద్రతా పరమైన చర్యలు చేపట్టి ఎక్కడా తోపులాట, తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా ప్రత్యేకంగా కళావేదికను ఏర్పాటు చేశారు. వైకుంఠ ద్వారం నుంచి వచ్చి శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునే భక్తులు అందరికీ తీర్థంతో పాటు అన్నప్రసాదాలు నిరంతరాయంగా అందించేలా చర్యలు తీసుకున్నారు. తుమ్మలగుంట గ్రామ శివార్లలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి అక్కడ మాత్రమే పార్కింగ్ చేయించాలని సూచించారు. ఆలయ ఈవో సుబ్రమణ్యంరెడ్డి, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



తుమ్మలగుంటలో ఏర్పాటు చేసిన ఆర్చి

ఉదయం 4 గంటలకు వైకుంఠ ద్వార ప్రవేశం!

తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వైకుంఠ ద్వార ప్రవేశం శుక్రవారం ఉదయం 4 గంటల నుంచి ప్రారంభమవుతుందని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. భక్తులందరూ నెమ్మదిగా స్వామి దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వెల్లడించారు.

వైఎస్ జగన్‌కు సాదర స్వాగతం

రేణిగుంట: వైకుంఠ ఏకాదశి టోకన్ల జారీ సందర్భంగా భక్తుల మధ్య జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించేందుకు గురువారం సాయంత్రం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, భరత్, తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి, ఓడూరు గిరిధర్‌రెడ్డి, ప్రభాకర్, కూనాటి రమణయ్యయాదవ్ తదితరులు ఘన స్వాగతం పలికారు.



రేణిగుంట విమానాశ్రయంలో పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి

2012 మోడల్ బుల్లెట్ ప్రూఫ్ వాహనం కేటాయింపు

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 2012 మోడల్ ఓ డొక్కు వాహనాన్ని అధికారులు కేటాయించి ఎయిర్‌పోర్ట్ బయట పెట్టారు. కండీషన్ సరిగా లేని వాహనాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసి మరోసారి అవమానపరిచారు. దీంతో ఆయన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి వాహనంలో వెళ్లారు.

చేతులెత్తేసిన టీటీడీ యంత్రాంగం

- గతంలో ఎన్నడూ ఇలాంటి దాఖలాలు లేవు
- అధికారుల నిర్లక్ష్యమే కారణం

తిరుమల : దేశంలో ఎన్నో ఆలయాలకు ఆదర్శంగా నిలుస్తూ వస్తోంది తిరుమల శ్రీవారి ఆలయం. లక్షల సంఖ్యలో వచ్చిన భక్తులకు సౌకర్యాల కల్పన, అన్నపానీయాలు అందించడంలో టీటీడీకి మంచి పేరుంది. లక్షల సంఖ్యలో భక్తులు వచ్చినా.. నిర్వహణ సామర్థ్యం టీటీడీకే సొంతం. ఎంతో దూరదృష్టి, అనుభవం ఉన్నా టీటీడీలో మునుపెన్నడూ జరగని విధంగా ఘోరమైన దుర్ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. 1500 మంది విజిలెన్స్, 3 వేల మంది పోలీసులకు భద్రత విధులు అప్పగించినా.. టీటీడీ చేసిన ఏర్పాట్లలో మాత్రం పూర్తి వైఫల్యం చెందింది. గతంలో సాధారణ తోపులాటలు జరిగినా భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎలక్ట్రికల్ సిబ్బంది నిర్లక్ష్యంతో 2016లో భక్తులు క్యూలైన్లో వెళ్లే సమయంలో వైర్లు తగిలి ఇద్దరు భక్తులు మృతి చెందారు. ఈ ఘటన మినహా భక్తులు ప్రమాదానికి గురైన ఘటనలు లేవు.

అధికారుల విఫలం.. 3 వేల పైచిలుకు రద్దీని సైతం కంట్రోల్ చేయడంలో అధికారులు విఫలమయ్యారు. శ్రీ పద్మావతి ఉద్యానవనంలో 4 వేలకు పైగా భక్తులు వేచి ఉండే అవకాశం లేదు. అధికారుల అంచనా ప్రకారం 3 వేల నుంచి 3500 మంది భక్తులు బైరాగిపట్టెడలోని శ్రీ పద్మావతి ఉద్యానవనంలో ఉన్నట్లుగా సమాచారం. ఉద్యానవనంలో వేచి ఉన్న భక్తులు సమన్వయం పాటించాలని ముందస్తు ప్రకటన చేయకుండా అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు గేట్లు తెరవడంతో తీవ్ర తొక్కిసలాట చోటు చేసుకుంది. ఇక కౌంటర్ల వద్ద చేరుకుంటున్న భక్తులను అంచనా వేయడంలోనూ, క్యూలైన్‌ను చక్కదిద్దడంలోనూ అటు టీటీడీ, ఇటు పోలీస్ శాఖ పూర్తిగా వైఫల్యం చెందాయి. భక్తులకు అనుగుణంగా ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. టైంస్లాట్ టోకెన్లు లేని సమయంలో లక్షకు పైగా భక్తులకు దర్శన భాగ్యం కల్పించగల సత్తా ఉండే టీటీడీ.. ప్రస్తుత అధికారుల నిర్లక్ష్యం కారణంగా పూర్తిగా విఫలమైంది. ఈ వ్యవహారాలపై అస్సలు అనుభవం లేని జేఈఓ గౌతమికి బాధ్యతలు అప్పగించడం ముఖ్య కారణంగా తెలుస్తోంది. 3 వేల మంది పోలీస్ సిబ్బంది పహారా కాస్తున్నారని చెప్పినా ఆచరణలో మాత్రం కౌంటర్ల వద్ద పదిమంది కూడా లేని పరిస్థితి. నిమిష నిమిషానికి భక్తుల రద్దీ పెరుగుతున్నా టోకెన్ల జారీ ప్రారంభించకపోవడంలో అధికారుల నిర్లక్ష్య ధోరణి బట్టబయలైంది. టోకెన్ ఉంటేనే వైకుంఠ ద్వారదర్శనం అంటూ టీటీడీ ప్రచారం చేయడం, తొలిరోజే భక్తులు దర్శనానికి అధిక సంఖ్యలో రావడం,సరైన భద్రతా ఏర్పాట్లు లేకపోవడమే ఈ ఘటనకు కారణమైంది.

కౌంటర్లు వద్ద బారులు తీరిన భక్తులు

కట్టుదిట్టమైన క్యూలైన్లు ఏర్పాటు చేయడంలో టీటీడీ విఫలమైంది. దీంతో సెంటర్‌కు పక్కనే ఉన్న బైరాగిపట్టెడ పద్మావతి పార్కులోకి భక్తులను మళ్లించారు. అక్కడ నుంచి భక్తులు ఒక్కసారిగా ముందుకు చొచ్చుకు రావడంతో భారీ తోపులాట జరిగింది. ఆ సమయంలో దాదాపు 3 వేల మంది భక్తులు అక్కడ ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో పలువురు ఊపిరి ఆడక సొమ్మసిల్లి పడిపోయారు. ఒక్క బైరాగిపట్టెడ వద్ద తొక్కిసలాటలోనే ఐదుగురు చనిపోవడమే అధికారుల నిర్లక్ష్యానికి సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ ఘటనకు కారకులైన ఈఓ, అదనపు ఈఓలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎస్వీయూలో ముగిసిన నిపుణుల కమిటీ పర్యటన

తిరుపతి సిటీ: ఎస్వీయూలో డీడీఈ విభాగంలో అడ్మిషన్ల పునరుద్ధరణపై మూడు రోజులుగా నిపుణుల కమిటీ నిర్వహించిన పర్యటన గురువారం ముగిసింది. వర్సిటీలోని డీడీఈలో డిగ్రీ, పీజీ, డిప్లొమో కోర్సులలో ప్రవేశాలను తిరిగి ప్రారంభించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సామర్థ్యం, వర్సిటీలో వనరుల లభ్యతపై సుదీర్ఘంగా కమిటీ పరిశీలించింది. ఇందులో భాగంగా వర్సిటీలో దూర విద్యా విభాగంలో కోర్సులు అందిస్తున్న విభాగాలు, సైకాలజీ, ఫిజిక్స్, ఓఆర్ఐ, సీప్ స్టడీస్, కేంద్రీయ గ్రంథాలయం, శ్రీనివాస ఆడిటోరియాలను, డీడీఈ అనుబంధ కేంద్రాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలో కమిటీ పూర్తి స్థాయి నివేదికను యూజీసీకి సమర్పించనుంది. 2025 ఏడాది నుంచే వర్సిటీలో డీడీఈలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో వర్సిటీ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, డీడీఈ డైరెక్టర్ తవమణి కమిటీ సభ్యులకు సహకరించి సమాచారాన్ని అందించారు. వర్సిటీని పర్యటించిన యూజీసీ కమిటీలో డిప్యూటీ సెక్రటరీ, లెఫ్టినెంట్ కమాండర్ వినోద్‌సింగ్‌యాదవ్, ప్రొఫెసర్ అశ్విని మహాపాత్ర, ప్రొఫెసర్ రాజేంద్రసింగ్, ప్రొఫెసర్ అరవింద్‌రనాడే ఉన్నారు.



సమాచారాన్ని సేకరిస్తున్న యూజీసీ కమిటీ

రైతు ఏటీఎం కార్డుతో నగదు అపహరణ

- ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులు లేకపోవడమే కారణం

పాకాల : నగదు తీసుకోవడానికి ఏటీఎం వద్దకు వచ్చిన రైతు కావలివారిపల్లికి చెందిన రైతు కె.నాగేశ్వర్‌రావు ఏటీఎం కార్డు నుంచి గుర్తు తెలియని వ్యక్తి నగదు అపహరించిన సంఘటన పాకాలలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. బాధితుడు గురువారం ఉదయం సుమారు 10.30 గంటల ప్రాంతంలో పాకాలలోని స్టేట్ బ్యాంక్ ఏటీఎం వద్దకు వచ్చాడు. నగదు విత్‌డ్రా చేయడానికి ప్రయత్నించాడు. అందులో నగదు రాకపోవడంతో పక్కనే ఉన్న యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం సెంటర్ వద్దకు వెళ్లాడు. అక్కడ కూడా నగదు రాలేదు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి తాను నగదు తీసిస్తానని నమ్మబలికాడు. ఏటీఎం కార్డు తీసుకున్నాడు. నగదు రాలేదని చెప్పి ఏటీఎం కార్డును తిరిగి ఇచ్చేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తీరా కార్డు చూసిన రైతు ఆ కార్డు తనది కాదని గుర్తించాడు. చుట్టుపక్కల గమనించినా గుర్తుతెలియని వ్యక్తి కనిపించలేదు. ఈలోపే రైతు ఖాతా నుంచి రూ.40 వేలు విత్‌డ్రా చేసినట్టు ఫోన్‌కు మెసేజ్ రావడంతో ఖంగుతిన్నాడు. ఖాతాలో ఉన్న మిగిలిన నగదును విత్‌డ్రా చేయకుండా చూడాలని స్టేట్ బ్యాంకు సిబ్బందిని ఆశ్రయించాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



బాధితుడు కె.నాగేశ్వర్‌రావు



సెక్యూరిటీ లేకుండా నిర్వహిస్తున్న యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం

సెక్యూరిటీ లేకపోడంతోనే మోసాలు

బ్యాంకు యాజమాన్యాలు ఏటీఎం సెంటర్ల వద్ద భద్రతను కల్పించకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులు ఉంటే లోపల ఒకరికి మించి వెళ్లే అవకాశం ఉండదని, తద్వారా మోసాలు జరగవని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులను నియమించాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడి ఇల్లు కూల్చివేత

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం పోలి పంచాయతీ వాంపల్లి దళితవాడకు చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు రంగారావు ఇంటిని గురువారం తెల్లవారుజామున నాలుగు గంటలకు రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. బఫర్‌జోన్ పేరిట గ్రామం మధ్యలో ఉన్న ఒక్క ఇంటిని కక్షపూరితంగా అధికారులు ఇంట్లో ఉన్న రంగారావు కుటుంబ సభ్యులను బలవంతంగా బయటకు పంపి, జేసీబీ సాయంతో కూల్చేశారు. సుమారు 150 ఇళ్లున్న ఈ కాలనీలో నడి మధ్యన ఉన్న ఈ ఒక్క ఇంటినే కూల్చివేయడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బఫర్‌జోన్ తన ఒక్క ఇంటికే వర్తిస్తుందా? ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అధికారులు దుర్మార్గంగా వ్యవహరించారని బాధితుడు రంగారావు వాపోయారు.



రంగారావు ఇంటిని కూల్చేస్తున్న అధికారులు

సముద్రంలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు

వాకాడు: తూపిలిపాళెం వద్ద సముద్రంలో గురువారం ఇద్దరు విద్యార్థులు స్నానాలు చేస్తూ గల్లంతయ్యారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని వైట్‌కుప్పం గ్రామానికి చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి మామిడి లోకేష్(17), అలాగే చిట్టమూరు మండలం, కొక్కుపాళెం గ్రామానికి చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థి ఇంగిలాల భాను(18) తన ఆరుగురు స్నేహితులతో కలిసి తూపిలిపాళెం బీచ్‌కు వెళ్లారు. అక్కడ స్నానాలు చేస్తుండగా ఒక్క సారిగా ఎగసిపడిన అలల ధాటికి లోకేష్, భాను అలల్లో చిక్కుకుని కొట్టుకుపోయారు. సమాచారం అదుకున్న అధికారులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.



ఆర్తనాదాలతో విలపిస్తున్న విద్యార్థుల కుటుంబ సభ్యులు

సమన్వయ లోపంతోనే దుర్ఘటన



మృతుల భౌతిక కాయాలను సందర్శిస్తున్న సీపీఐ నేతలు



కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న సీపీఎం, సీపీఐ, పౌర సంఘాల సమాఖ్య నాయకులు

– సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

తిరుపతి కల్చరల్: టీటీడీ, పోలీసు అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగానే తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టిక్కెట్ల జారీ కౌంటర్ల వద్ద తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మృతి చెందారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన తిరుపతి తొక్కిసలాటలో మృతి చెందిన వారి మృతదేహాలను రుయా ఆస్పత్రి మార్చురీలో సందర్శించి వారి కుటుంబాలను ఓదార్చారు. అలాగే స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. అక్కడే ఉన్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లుతో మాట్లాడి తొక్కిసలాట వివరాలను అడిగి తెలుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.5 లక్షలు వంతున నష్ట పరిహారం చెల్లించాలన్నారు. అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుంటే ఈ దుర్ఘటన జరిగేది కాదని తెలిపారు. సీపీఐ నేతలు హరినాథరెడ్డి, రాధాకృష్ణ, చిన్నం పెంచలయ్య, విశ్వనాథ్, ఏఐఎస్ఎఫ్ నేత శివారెడ్డి ఉన్నారు.

మృతి చెందిన భక్తులకు ఘన నివాళి

తిరుపతి సిటీ: నగరంలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన శ్రీవారి భక్తులకు తిరుపతి పౌరసంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో టీటీడీ పరిపాలన భవనం ఎదుట గురువారం రాత్రి దీపాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నేత కందారపు మురళి మాట్లాడుతూ తిరుపతి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఆరుగురు భక్తులు మరణించడం బాధాకరమన్నారు. టీటీడీకి ఇది ఓ మాయని మచ్చలా మిగిలిపోతుందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, క్షతగాత్రులకు రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం, కాంట్రాక్టు ఉద్యోగం ఇవ్వడం సమంజసం కాదని, తక్షణం ఈ నిర్ణయాన్ని మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. కన్వీనర్ సుబ్రమణ్యం, రిపబ్లికన్ పార్టీ దక్షిణ భారత అధ్యక్షుడు పూతలపట్టు అంజయ్య, కాంగ్రెస్ నాయకులు మాంగాటి గోపాల్ రెడ్డి, సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, బాలోత్సవం, యూటీఎఫ్, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.